క్లుప్తంగా

క్రీడాకారిణికి నేతల అభినందన



కృష్ణవేణిని అభినందిస్తున్న మాజీ సర్పంచ్ దామోదర్‌రెడ్డి

కొడంగల్ రూరల్: 37వ యానివల్ సౌత్ ఇండియా కింగ్స్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో 2023 స్టేట్ లెవల్ బ్లూ బెల్ట్ సాధించిన ఇంటర్ విద్యార్థిని కృష్ణవేణిని మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పటోళ్ల దామోదర్‌రెడ్డి, సీనియర్ నాయకులు బాస్‌పల్లి బుచ్చిరెడ్డి అభినందించారు. మంగళవారం కొడంగల్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన బుజ్జారం చిన్న కిష్టప్ప–బుజ్జమ్మ దంపతుల కూతురు కృష్ణవేణిని వారు సన్మానించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించడం అభినందనీయమన్నారు.

ప్రత్యేక అలంకరణలో భవానీమాత



బషీరాబాద్: దామర్‌చెడ్ భవానీ నగర్‌లో వెలసిన అంబాభవానీ మాతను దర్శించుకోవడానికి మంగళవారం భక్తులు భారీగా తరలి వచ్చారు. ఆలయ పీఠాధిపతి శ్రీశంకర్ స్వామీజి ఆధ్వర్యంలో మాతకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించగా.. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు పీఠాధిపతి ప్రవచనాలు వినిపించారు. అనంతరం అన్నదానం చేశారు.

1న టీఎస్‌యూటీఎఫ్ మహాధర్నా

ధారూరు: సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై నిర్వహించే మహాధర్నా కార్యక్రమానికి తరలి రావాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ధారూరులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం వారు మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్య, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. పదోన్నతులు కల్పించి, ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు అజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, హెచ్‌ఎం దేవియా, సంఘం నాయకులు రాజారత్నం, నర్సింహులు, కృష్ణ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



జిల్లా కేంద్రానికి తరలివెళ్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

కొడంగల్ రూరల్: సమస్యలు పరిష్కరించాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు మంగళవారం జిల్లా కేంద్రానికి ఉద్యోగులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీని అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమగ్ర శిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు.

నర్సరీ నిర్వహణలో అశ్రద్ధ వద్దు

వికారాబాద్ అర్బన్: నర్సరీ నిర్వహణలో అశ్రద్ధ వహించవద్దని మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆమె మున్సిపల్ కమిషనర్ జాకిర్ అహ్మద్‌తో కలిసి పట్టణ పరిధి కంచర్ల గుట్టపై ఉన్న నర్సరీని పర్యవేక్షించి మాట్లాడారు. నర్సరీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల సమస్యలు పట్టని ప్రభుత్వం

కొడంగల్ రూరల్: కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్ ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలకు వారు మద్దతు తెలిపి మాట్లాడారు. 20 ఏళ్లుగా వివిధ విభాగాల్లో సేవలు అందిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు శ్రీనివాస్, దస్తప్ప, వెంకటయ్య, జమీరొద్దీన్, కృష్ణ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఆత్మీయ అనుబంధానికి ప్రతీక రాఖీ

- సాంకేతిక పెరిగినా తరగని ఆధరణ
- సోదరీ సోదర భావానికి రక్షాబంధన్
- మార్కెట్‌లో వివిధ ఆకృతుల్లో రాఖీలు
- ఆన్‌లైన్, ఆర్టీసీ కార్గోల ద్వారా సరఫరా
- నేడు రాఖీ పౌర్ణమి



రాఖీలను కొనుగోలు చేస్తున్న సోదర సోదరీమణులు

సోదర, సోదరీమణుల ఆత్మీయ అనుబంధాలకు ప్రతీక రాఖీ పౌర్ణమి. ఎక్కడెక్కడో స్థిరపడిన తోబుట్టువుల కోసం అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లు తహతహలాడే శుభసందర్భం. అలాంటి ఉత్సవం జరుపుకొనేందుకు నేడు సకల జనులు సిద్ధమయ్యారు. నువ్వు చల్లగా ఉండాలి.. సోదరా అంటూ ఆడపడుచులు రాఖీ కట్టగా.. నీకు అండగా నేనున్నా సోదరీ అంటూ సోదరులు కట్నకానుకలు సమర్పించి, ఆశీర్వాదం తీసుకునే సంబురం సందర్భంగా 'సాక్షి' కథనం..

పరిగి: కాలం మారినా, దూరం పెరిగినా, చెరగని బంధం అన్నా, చెల్లెళ్ల అనుబంధం. అన్నా చెల్లెళ్ల, అక్కా తమ్ముళ్ల అనురాగాలు, ఆప్యాయతలకు ప్రతీక రాఖీ పండుగ. జీవితంలో తనకు ఎల్లవేళలా రక్షణగా ఉండాలని, కష్ట సుఖాల్లో తోడునీడగా నిలవాలని అక్క, చెల్లెళ్లు అన్నదమ్ములకు రాఖీ కట్టడానికి తమ పుట్టింటికి వస్తారు. అందులో భాగంగానే తమకిష్టమైన విభిన్న ఆకృతులు, ఆకర్షణీయమైన రంగులతో ఆకట్టుకుంటున్న రాఖీలను కొనుగోలు చేసేందుకు సోదరిమణులు ఉత్సాహం చూపుతున్నారు.

బాధ్యతను గుర్తు చేసే..

ఏ శుభ కార్యమైనా చేయాలని సంకల్పించినప్పుడు ఆ పని నిర్విఘ్నంగా నెరవేర్చాలని, అనుక్షణం లక్ష్యం గురించి ఆలోచిస్తూ ఉండాలని రక్ష పేరిట గతంలో మణికట్టుకు దారపు బంధాన్ని కట్టడం హైందవ సాంప్రదాయం. పెళ్లి, వ్రతాలు, ప్రతిష్టలు పూజలు తదితర కార్యాల్లో ఇంటి ముఖద్వారానికి రక్షాలను కట్టడం అనాదిగా వస్తోంది. ఈ రక్షలను ప్రధాన వ్యక్తులు ధరించి, ఆ కార్యాన్ని పూర్తి చేస్తారు. సోదరుల విజయాన్ని సంతోషాన్ని కోరుతూ సోదరీమణులు వారి కుడిచేతి మణికట్టుకు రక్ష సూత్రాన్ని కట్టడం ఏళ్ల నుంచి వస్తున్నదే. యేటా శ్రావణ పౌర్ణమిరోజు జరుపుకొనే రాఖీ పండుగకు ఎంతో ప్రత్యేక ఉంది. అనేక చరిత్రలు ఉన్నాయి. ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో పండుగను పిలుస్తుంటారు.

ఆకర్షించే రాఖీలు

చిన్నారులు టీవీల్లో చూసే రకరకాల బొమ్మలతో తయారు చేసిన రాఖీలను ప్రత్యేకంగా తయారు చేసి దుకాణాల్లో అమ్ముతున్నారు. వీటిని పిల్లలు ఇష్టపడి కొనుగోలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది కొత్తగా ఆన్‌లైన్‌లో రాఖీల విక్రయాలు జరుగుతున్నాయి. టీఎస్‌ఆర్టీసీ కార్గో, ఇతర సంస్థలు రాఖీల పంపిణీ 24గంటల్లో డెలివరీ చేసే విధంగా ఏర్పాట్లు చేశాయి.

సాంకేతికత పెరిగినా..

స్నేహితుల దినోత్సవం, పుట్టిన రోజు, ఇలా ఏ పండుగ అయినా నేడు కొందరు వాట్సప్, ఫేస్‌బుక్‌ల ద్వారా శుభాకాంక్షలు తెలుపుకొంటున్నారు. టెక్నాలజీ పెరిగినా నేటికీ ఆధరణ తగ్గని పండుగగా రాఖీ నిలుస్తోంది. ఎంత సుదూర ప్రాంతాలైనా రాఖీ పండుగ అనగానే అక్కాచెల్లెళ్లకు అన్నదమ్ములు గుర్తుకు వస్తారు. ఆ రోజున తప్పకుండా సోదరుల వద్దకు వెళతారు. తమ బాధ్యతగా రాఖీ కట్టి దీవిస్తారు.

సోదర ప్రేమకు ప్రతిరూపం



సంస్కృతి సంప్రదాయాలకు, సోదర ప్రేమకు ప్రతీక రాఖీ పౌర్ణమి. ఈ పండుగ వచ్చిందంటే నా సోదరులపై నాకున్న ప్రేమానురాగాలు రెట్టింపు అవుతాయి. ఎప్పుడెప్పుడు వెళ్లి అన్నదమ్ముళ్లకు రాఖీ కట్టాలా అని ఎదురు చూస్తుంటాను. అంతే స్థాయిలో వారూ నా కోసం నిరీక్షిస్తారు.

– హరిప్రియ, పరిగి జెడ్పీటీసీ

ఎంత దూరం ఉన్నా..



విధినిర్వహణలో ఎంత దూరం ఉన్న రాఖీ పౌర్ణమి రోజున తప్పకుండా మా అన్నదమ్ములకు రాఖీ కడతాను. ఏదైనా అనుకోని పరిస్థితుల్లో వెళ్లలేక పోతే పోస్టు, కార్గో ద్వారా రాఖీలను పంపించి సమాచారం అందజేస్తా. అలా చేయనైతే చేస్తాను కానీ.. నేరుగా తోబుట్టువుల మణికట్టుకు రాఖీ కట్టినంత ఆనందం అయితే ఉండదు.

– మంజుల, పరిగి

బషీరాబాద్‌కు 30 పడకల ఆస్పత్రి

- రూ.10.60 కోట్ల నిధులు మంజూరు
- మెరుగు పడనున్న వైద్యసేవలు
- జీఓ 490 జారీ చేసిన ప్రభుత్వం



బషీరాబాద్ ప్రాథమిక చికిత్స కేంద్రం

బషీరాబాద్: కర్ణాటక సరిహద్దు మండలం బషీరాబాద్‌కు రాష్ట్ర ప్రభుత్వం 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను మంజూరు చేసింది. ఈ మేరకు రూ.10.60 కోట్ల నిధులను మంజూరు చేస్తూ తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ మంగళవారం జీఓ 490 జారీ చేశారు. తాండూరు నియోజకవర్గంలో అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఉన్న అక్కడ రెండు పీహెచ్‌సీలు ఉన్నాయి. కానీ సరైన వైద్య సిబ్బందిలేక స్థానికులకు చిన్నపాటి అనారోగ్యం సమస్య వచ్చినా జిల్లా ఆస్పత్రికి వెళ్తున్నారు.

పెరగనున్న సేవలు

మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో 24 గంటల వైద్యసేవలు అందని ద్రాక్షే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తన సొంత మండలం బషీరాబాద్‌కు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కావాలని గతంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు కొత్తగా మంజూరైన హెల్త్ సెంటర్‌లో 30 పడకలతో పాటు చిన్నిచిన్న ఆపరేషన్‌లు, ప్రసవాలు, రక్తపరీక్షలు, స్కానింగ్, శవ పరీక్షలు(పోస్టుమార్టం) వంటి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో పాటు కంటి, దంత వైద్య నిపుణులు, వైద్యసిబ్బందిని నియమించేనన్నారు. ఈ ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే మండల ప్రజలు తాండూరు జిల్లా ఆస్పత్రికి వైద్యం కోసం వెళ్లే పరిస్థితులు ఉండవని వైద్యులు చెప్పారు.

మెరుగైన వైద్యసేవలు



సామాజిక ఆరోగ్య కేంద్రం మంజూరుతో ఇకపై మండల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం బషీరాబాద్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మాత్రమే ఉన్నందున కొత్త ఆస్పత్రి నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించి, వినియోగంలోకి తెస్తాం.

– రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్యే

ఓటుకున్న శక్తి దేనికీ లేదు

- అర్హులు ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలి
- తహసీల్దార్ దానయ్య



ఓటర్ల వివరాలను సేకరిస్తున్న తహసీల్దార్

పరిగి: ఓటు హక్కుకు ఉన్న శక్తి దేనికీ లేదని, ఆ హక్కుతోనే పాలకులను ఎన్నుకుంటామని తహసీల్దార్ దానయ్య అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని పలు వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి డబుల్ ఓటు ఉన్న వారి వివరాలను సేకరించి తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే వెంటనే వాటిని సరిచేసుకోవాలని సూచించారు. అధికారులు డబుల్ ఓటుఉన్న వారి వివరాలను సేకరిస్తున్నారని, అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నరసింహరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ కవిత తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనురాధ

- బ్యాంకు లింకేజీ ద్వారా రూ.9కోట్ల రుణాలు
- రెగ్యులర్ సంఘాలకు రూ.20లక్షలు..
- ఎంపీపీ అనురాధ, ఏపీఎం బాలయ్య

పెద్దేముల్: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు, అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ అనురాధ అన్నారు. మంగళవారం స్థానిక రైతువేదికలో ఏర్పాటు చేసిన మహిళా పరస్పర సహాయ సహకార పొదుపు సమాఖ్య లిమిటెడ్ 15వ సర్వసభ్య సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్వయం సహాయక, స్నేహ సంఘం సభ్యులు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొని, లబ్ధి పొందాలని సూచించారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే సంఘం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. బ్యాంకు లింకేజీ ద్వారా రూ.9కోట్లు, శ్రీనిధి కింద రూ.కోటి రుణాలు అందజేశామని ఆమె పేర్కొన్నారు. ఎంపీడీఓ లక్ష్మప్ప మాట్లాడుతూ పెద్దేముల్ మహిళా సమాఖ్య రూ.28లక్షల లాభాల్లో ఉందని చెప్పారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. తీసుకున్న రుణాలు సక్రమంగా కట్టలేక జిల్లాలో పెద్దేముల్ సమాఖ్య వెనుకబడి ఉందని పేర్కొన్నారు. ఏపీఎం బాలయ్య మాట్లాడుతూ బ్యాంకు అధికారులు పొదుపు రుణాలతో పాటు వ్యక్తి గత రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు అండాలమ్మ, ఉపాధ్యక్షురాలు పద్మమ్మ , కార్యదర్శిగా అక్షయ, సహాయ కార్యదర్శి యశోద, కోశాధికారి మంజుల, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

'మాకు అన్యాయం జరుగుతోంది'

- ముదిరాజ్‌లు, గంగపుత్రులను కలిపే ఎన్నికలు చేపట్టాలి
- ముదిరాజ్ సంఘం నేతలు



రూప్‌ఖాన్‌పేట్‌లో ఆందోళన చేస్తున్న ముదిరాజ్‌లు

పరిగి: మత్స్యసహకార సంఘంలో తమకు అన్యాయం జరుగుతుందని ముదిరాజ్‌లు ఆందోళన చేశారు. ఈ మేరకు మంగళవారం రూప్‌ఖాన్‌పేట్‌లో చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గ్రామంలో 20 సంవత్సరాలుగా ముదిరాజ్‌లు, గంగపుత్రులు కలిసి సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. గ్రామంలో నాలుగు చెరువులు ఉండగా.. గంగపుత్రులు తక్కువగా ఉండటంతో ఒక చెరువు వారికి, మూడు చెరువులు ముదిరాజ్‌లకు పెద్దలు కేటాయించారని పేర్కొన్నారు. సంఘంలో ఉన్న ముదిరాజ్‌లు చనిపోయారని, వారి స్థానంలో వేరే గ్రామాలకు చెందిన వారి పేర్లు నమోదు చేసి ఎన్నికల నిర్వహిస్తుండటంతో ఆందోళన చేపట్టామని ముదిరాజ్ వాపోయారు. ఉన్న వారు చనిపోయారని, వేరే గ్రామాలకు చెందిన వారికి సభ్యత్వం ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ముదిరాజ్‌లకు, గంగపుత్రులకు కలిపే సభ్యత్వం నమోదు చేసి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌ల ఆందోళన నేపథ్యంలో పోలీసులు నిరసన స్థలానికి చేరుకుని, ఆందోళన కారులను సముదాయించారు. మత్స్యసహకార సంఘం ఎన్నికల నిర్వహనకు వచ్చిన ఎన్నికల అధికారి (అసిస్టెంట్ రిజిస్ట్రేషన్ కో ఆపరేటివ్) విక్రమ్ ఎన్నికలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు.

మాతృభాషతోనే విజ్ఞానాభివృద్ధి

- అమ్మభాషను ప్రేమించు.. ఇతర భాషలను గౌరవించు
- తెలుగు భాష దినోత్సవంలో ఉపాధ్యాయులు



కొడంగల్ రూరల్: గిరిజన గురుకుల పాఠశాలలో గిడుగు రామ్మూర్తి, క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు



దోమ: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయురాలు మల్లమ్మ

దోమ: 'ప్రపంచంలో ఎన్ని భాషలు ఉన్నా.. మాతృభాషను ప్రేమించాలి. పట్టుసాధించాలి. అప్పుడే ఆత్మగౌరవం పెగుతుంది. విజ్ఞానం అభివృద్ధి చెందుతుంది' అని ఉపాధ్యాయులు అన్నారు. తెలుగు భాష దినోత్సవం సందర్భంగా మంగళవారం దోమ మండలం దొంగ ఎన్కేపల్లి పాఠశాలలో తెలుగు భాషపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు మాట్లాడారు. ప్రపంచ భాషల్లోనే తెలుగుభాష ఒక విశిష్టమైన స్థానాన్ని కలిగి ఉందని పేర్కొన్నారు. నేటి యువత భాష ప్రాముఖ్యతను తెలుసుకొని, తెలుగు పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. మాతృభాషను ప్రేమిస్తూ.. ఇతర భాషలను గౌరవిస్తూ.. అభివృద్ధి పథంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరప్ప, మల్లమ్మ, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: తెలుగు భాషా దినోత్సవంతో పాటు జాతీయ క్రీడోత్సవాన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా జరుపుకొన్నారు. పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మున్సిపల్ పరిధిలోని తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాలలో ఉదయం తెలుగు భాష దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం సాక్ రేస్, రోప్ జంపింగ్, చెస్, క్యారమ్ తదితర క్రీడా పోటీలు జరిపారు. ఇందులో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్స్‌పాల్ బలరాం, కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్, సోమ్లా, రమేష్, రాంబాబు, స్వప్న, స్వరూప, మోహన్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

మమకారం పెంచుకోవాలి

తాండూరు: మాతృభాష మరుగున పడే పరిస్థితులు కనిపిస్తున్నాయని, విద్యార్థులు తెలుగు భాషపై మమకారం పెంచుకోవాలని తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి సూచించారు. తెలుగు భాష దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పీపుల్స్ డిగ్రీకళాశాల, మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆమె మొక్కలను నాటారు. మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తేనే భావితరాలకు ఊపిరిగా ఉంటుందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ వరలక్ష్మి, ప్రిన్సిపాల్ స్వప్న, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గిడుగు జయంతి

కుల్కచర్ల: ప్రతి విద్యార్థి తెలుగు భాషపై మక్కువను పెంచుకోవాలని కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో అంతర్జాతీయ తెలుగుభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని నిర్వహించారు. అనంతరం తెలుగుపై అవగాహన కల్పించారు. తెలుగు భాష గొప్పతనం, ఔన్నత్యాన్ని, విశిష్టతను రాబోయే తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. నన్నయ్య, తిక్కన్న లాంటి మహాకవులు భాష విస్తృతికి చేసిన ప్రయత్నాలను ఆమె వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

దోమ: దోమ మండలం గూడూర్ గ్రామానికి చెందిన అంతమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఇందులో కాసాని ఫౌండేషన్, టీడీపీ నేతలు యాదయ్య, శివకుమార్, జంగయ్య, కృష్ణయ్య, చిన్నయ్య ఉన్నారు.

క్రీడలు చదువులో భాగమే..

- ఆటలతో పోటీతత్వం అలవడుతుంది
- క్రీడాదినోత్సవంలో వక్తలు



కుల్కచర్ల: ముజాహిద్‌పూర్ పాఠశాలలో స్పోర్ట్స్ డే సందర్భంగా విద్యార్థుల ప్రదర్శన

పరిగి: స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొని రాణించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్ మాట్లాడారు. క్రీడలు చదువులో భాగమేనని, విద్యార్థులు ఆటల్లో రాణించాలని సూచించారు. క్రీడలు ఆడని వారు ఒంటరిగా కూర్చొని, వ్యసనాలకు బానిసలవుతున్నారని పేర్కొన్నారు. నలుగురితో కలిసి ఆడటం వలన గెలుపు, ఓటములను స్వీకరించడం, ఓర్పు సహనం అలవాటు అవుతుందని వెల్లడించారు. క్రీడలతో సెల్ ఫోన్ వినియోగం తగ్గించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని సంఘం లక్ష్మీబాయి గురుకుల బాలికల పాఠశాలలో జాతీయ క్రీడ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ రమణమ్మ మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలు మానసిక ప్రశాంత, దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. తమ కళాశాల విద్యార్థిని రుక్మిణి అంతర్జాతీయ ఖోఖో పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించారు.

తెలుగు భాష దినోత్సవం

తెలుగు భాష దినోత్సవం సందర్భంగా విద్యార్థులు పలు తెలుగు పాటలు, పద్యాలు, ఆటలు, మాటలు, నాటికలు అన్ని రకాల కార్యక్రమాలతో తెలుగు గొప్పతనాన్ని చాటారు. అమ్మ భాష కన్నా గొప్పనైనది ఏదీ లేదని ప్రిన్సిపాల్ చెప్పారు.

ఆటలపై మక్కువ చూపాలి

కుల్కచర్ల: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి అన్నారు. క్రీడా దినోత్సవం సందర్భంగా కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని, అప్పుడే శారీరక దృఢత్వం పెంపొంది, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ జీపీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

పూడూరు: ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న చన్గోముల్ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. ఆరుగురు వార్డు సభ్యులు రాజీనామా చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ వరలక్ష్మికి రాజీనామా పత్రాన్ని అందజేసి మాట్లాడారు. తమకు సమాచారం ఇవ్వకుండా కార్యదర్శి పరశురాం అధికార పార్టీ నాయకులతో కలిసి ఏకపక్షంగా తీర్మానాలు చేసుకుంటున్నారని విమర్శించారు. ఇందులో ఇస్మాపురం యాదగిరి, అక్కాపురం నర్సింహులు గౌడ్, మల్కాపురం స్వప్న, తహిమీనా నస్రీన్, మన్నేగుడం లలిత, ఆనందం ఉన్నారు.

◆ ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కుల్కచర్ల: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం కుల్కచర్ల మండల కేంద్రంతో పాటు మందిపల్ గ్రామంలో స్థానిక నేతలతో కలిసి పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం మందిపల్‌లో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేశారు.

◆ నేడు డీఎంహెచ్‌ఓ కార్యాలయం ముట్టడి

అనంతగిరి: సమస్యల పరిష్కారం కోసం పక్షం రోజులుగా సెకండ్ ఏఎన్‌ఎంలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ ఆరోపించారు. సమ్మెలో భాగంగా బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డీఎంహెచ్‌ఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని చెప్పారు. ఏఎన్‌ఎంలు లలిత, సుజాత, సువర్ణ, రోజా, పద్మ, వెంకటమ్మ, లక్ష్మి ఉన్నారు.


◆ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

అనంతగిరి: ఐసీడీఎస్‌లో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్, వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అంగన్‌వాడీ సమస్యలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఇందులో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు స్వరూప, పద్మ, హంస, భవాని, చంద్రకళ, లక్ష్మి, సరళ, అరుణ పాల్గొన్నారు.

◆ గొర్రెల కాపరుల పట్ల వివక్ష

కొడంగల్: రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలని కొడంగల్ తాలూకా యాదవ సంఘం నాయకులు మన్నె బస్వరాజ్, పోలేపల్లి వెంకటయ్య, నందిగామ అజయ్‌యాదవ్‌లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు మంగళవారం మాట్లాడారు. గొర్రెల కాపరులు వారి వాటా కింద రూ.43,750 చెల్లించి నాలుగు నెలలు అవుతున్నా.. జీవాలను పంపిణీ చేయడం లేదన్నారు. కొన్ని సామాజిక వర్గాలకు ఎలాంటి పెట్టుబడి లేకుండా రూ.లక్షలు ఉచితంగా ఇస్తున్న సీఎం కేసీఆర్.. గొర్రెల కాపరుల పట్ల వివక్ష చూపుతున్నారని ఆరోపించారు.

◆ ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవాలి



వివేక్‌ను అభినందిస్తున్న డీఎస్పీ శేఖర్‌గౌడ్

తాండూరు: కాలానికి అనుగుణంగా విద్యార్థి దశలోనే ఆత్మరక్షణ విద్యను అభ్యసించాలని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం జాతీయ స్థాయిలో తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించిన విద్యార్థి వివేక్‌ను డీఎస్పీ శేఖర్‌గౌడ్, సీఐ రాంబాబులు అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. తైక్వాండో విద్య ఆత్మరక్షణతో పాటు మానసిక దృఢత్వం పెంపొందుతుందన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ మనోహర్‌ను డీఎస్పీ అభినందించారు.